క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలిరూరల్: విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా తెనాలి పట్టణంతోపాటు మండల గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ డీఈ వీవీ చిరంజీవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



తెనాలిరూరల్: మండలంలోని అంగలకుదురు గ్రామానికి చెందిన మాజీ జవాను నలుకుర్తి రవి ఆధ్వర్యంలో గ్రామ ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పలకలు జామెంట్రీ బాక్సులను శుకవారం పంపిణీ చేశారు. పాఠశాలలోని 40 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, సుద్దపల్లి నాగరాజు, అత్తోట శరత్, న్యాయవాదులు, ఇందుపల్లి రాజారాం, సుద్దపల్లి మురళి, మందా జనార్ధనరావు, సోమశేఖరరావు, కుమార్, ఏసోబు తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఆరుగురు విద్యార్థుల ఎంపిక

కొల్లిపర: 2023–24లో 10వ తరగతి పూర్తి చేసుకున్న మండల పరిధిలోని అత్తోట గ్రామంలోని కేవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముగ్గురు, మున్నంగి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ముగ్గురికి ట్రిపుల్ ఐటీలో స్థానం దక్కిందని అత్తోట ప్రధానోపాధ్యాయురాలు వై.భారతి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని అత్తోట హైస్కూలో జరిగిన సమావేశంలో బారతి మాట్లాడుతూ హైస్కూల్‌కు చెందిన వై.లక్ష్మీపూజిత, చందు మేఘన, వై.నాగసత్యం, మున్నంగి హైస్కూల్‌కు చెందిన కె.వివేక్, సిరిచైతన్య, రాగసుస్మితలు గురువారం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీకీ ఎంపికైన వారిని వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

భవిత కేంద్రానికి కుర్చీలు వితరణ



కొల్లిపర: భవిత కేంద్రంలోని విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండనటానికి కొల్లిపర గ్రామానికి చెందిన భీమవరపు వేణుగోపాలరెడ్డి శుక్రవారం ఎంఈవో 1, 2 సాల్మన్‌రాజ్, ఝాన్సీలత సమక్షంలో భవిత కేంద్రంలో 16 కుర్చీలు, 2 టేబుల్స్, ఫిజియోథెరపికి సంబంధించిన పరికరాలు అందించారు. ఈ సందర్భంగా దాత వేణుగోపాలరెడ్డి గురించి ఎంఈవోలు మాట్లాడుతూ భవిత కేంద్రంలో అంగవైకల్యంతో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల గురించి ఆలోచించి వారికి ఉపయోగకరంగా కుర్చీలు, వ్యాయామం కోసం పరికరాలు అందించటం అభినందనీయమన్నారు. అనంతరం భవిత కేంద్రం ఉపాధ్యాయులు దాత వేణుగోపాలరెడ్డిని శాలువాతో, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరఫీ ఉపాధ్యాయులు ఎం.శివనాగమల్లేశ్వర రావు, ఉపాధ్యాయులు పి.మృత్యుంజయరావు, డి.సురేష్ బాబు, కె.పాపయ్య, ఎంఐఎస్ ఎస్.రమేష్, సీఆర్‌పీలు పి.రమేష్‌బాబు, మురళీ, ఆయా నాగమణి పాల్గొన్నారు.

21న పెదపూడి ఐటీఐలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తెనాలి: బాపట్ల జిల్లా అమృతలూరు మండలంలోని పెదపూడిలో గల ప్రభుత్వ ఐటీఐలో 1988–91 మధ్య ఐటీఐ విద్య అభ్యసించిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఈనెల 21న నిర్వహించనున్నట్టు నాటి విద్యార్థుల్లో ఒకరైన గోలి భానుప్రకాష్, షేక్ సైదా శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆనాటి ప్రిన్సిపాల్ మేకల శేషగిరిరావు ముఖ్యఅతిథిగా హాజరు కా నున్నట్టు తెలిపారు. ఆ బ్యాచ్‌లో మోటార్ మెకానిక్, కార్పెంటరీ ట్రేడ్లలో విద్యనభ్యసించిన విద్యార్థులు ఈ సమ్మేళనంలో తప్పకుండా పాల్గొనాలని కోరారు. వివరాల కోసం 9014650393, 9010911164 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రేపు కంటి సమస్యలపై అవగాహన సదస్సు

గుంటూరు మెడికల్: ఈ నెల 14న 'రెటినోపతి ఉచిత పరీక్ష శిబిరం – శాస్త్రీయ అవగాహన సభ' నిర్వహించనున్నట్లు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి.సేవకుమార్, పావులూరి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు 2/1 బ్రాడీ పేటలోని ఎస్.హెచ్.ఒ భవనంలో నిర్వహించే ఈ శిబిరంలో డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ డాక్టర్ రాచపల్లి కల్పనా రెడ్డి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. వైద్య సలహాలు అందజేస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు.

రేపు తెనాలిలో హరికథ కళాకారిణికి సత్కారం

- మహానేత రాజన్న జయంతి సందర్భంగా అందజేత
- 'గాన కోకిల' శ్రీవాణిగా అందరిచేత ప్రశంసలు



వి.శ్రీవాణి

తెనాలి: మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి 75వ జయంతిని పురస్కరించుకుని ప్రఖ్య చిల్డ్రన్ ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో ప్రముఖ హరికథా భాగవతారిణి వి.శ్రీవాణికి సత్కారం, 'విజయముద్రిక' హరికథాగానాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 14వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో జరిగే సభకు మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివ కుమార్, తెనాలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైఎస్సార్‌సీపీ జిల్లా గుంటూరు జిల్లా అధ్యక్షురాలు బూరెల నాంచారమ్మ సహా పలువురు రంగస్థల దర్శకులు, నటీనటులు పాల్గొంటారు.

ఈ సందర్భంగా వి.శ్రీవాణి ప్రతిభా విశేషాలను పరిశీలిస్తే...

సర్వకళల సమాహారం హరికథ. పురాణాలపై అవగాహన, ఆకట్టుకునేలా చెప్పగలిగిన నేర్పు, భాషా సౌందర్యం, పదాల పదబంధాలతో ప్రేక్షకుల్ని పురాణ కథలో లీనమయ్యేలా తనతోపాటు తీసుకెళ్ల గలిగిన చాతుర్యం, సమర్థత హరికథకుడికి ఉండాల్సిన లక్షణాలు. మగవాళ్లకే పరిమితమైన ఈ కళలో తెనాలి నుంచి ఎందరో మహిళలు ఎదిగారు. ఆ కళే జీవితంగా రాణిస్తున్నారు. బతుకును తీర్చిదిద్దుకున్నారు. హరికథకు ఆదిభట్ల నారాయణదాసు పితామహుడు అయితే, మహిళల్ని ఈ రంగంలోకి తీసుకొచ్చి, మరింత వర్ధిల్లేలా చేసిన మహానుభావుడు తెనాలికి చెందిన తెల్లాకుల వెంకటేశ్వర గుప్తా భాగవతార్. సొంత ఇంట్లోనే హరికథా పాఠశాలను నడిపారు. ప్రత్యేకించి బాలికలను హరికథకులుగా తీర్చిదిద్దారు. పేద బాలికలకు వసతి, భోజనం, వస్త్రాలతో సహా సమకూర్చి హరికథను నేర్పించారు. ఆ మహానుభావుడి కారణంగా ఎందరో మహిళలు హరికథా భాగవతారిణులుగా ఎదిగారు.

అలాంటి వారిలో తెనాలికి చెందిన వి.శ్రీవాణి ఒకరు. తల్లిదండ్రులు తిన్నలూరి రామారావు, రాధమ్మ. రామారావు చదువుకుని ఉద్యోగం చేశారు. రాధమ్మ మేనమామలు తిరుపతి పొన్నారావు, వారి అన్నదమ్ములు సంగీత విద్వాంసులు, వయొలిన్, గాత్రంలో పేరు ప్రఖ్యాతులు సాధించారు. వారి మేనకోడలుగా శ్రీవాణి ఆ కళావారసత్వం అబ్బింది అంటారు. తెల్లాకుల వేంకటేశ్వర గుప్త శిష్యరికంలో 11వ ఏట నుంచే శిక్షణ ఆరంభించారు. తొలుత బుర్రకథలు, తర్వాత హరికథలు నేర్చారు. అప్పట్లో చెన్నైలోని ఆంధ్ర మహాసభ, సౌందర్య మహల్, గోవాలోని ఆంధ్రుల సహకారంతో హరికథలు ఏర్పాటు చేసేవారు. గురువు వేంకటేశ్వర గుప్తకు అక్కడ ఎన్నోసార్లు సత్కారాలు జరిగేవి. గురువు దగ్గర నేర్చిన విద్యతో శ్రీవాణి చెన్నై, గోవాతో పాటు బెంగళూరు, తిరుపతి, చిత్తూరు, శ్రీశైలం, కర్నూలు, కడప... ఇలా దేశంలోని అనేక ప్రాంతాల్లో హరికథాగానం చేశారు.

వీరి నేతృత్వంలోని 'వాణీ దళం' ప్రఖ్యాతి పొందింది. 'పార్వతీ కళ్యాణం', 'సీతారామ కల్యాణం', 'శశిరేఖ పరిణయం, 'విజయముద్రిక' వంటి హరికథలు శ్రీవాణికి బాగా గుర్తింపును తీసుకొచ్చాయి. రేడియో, టీవీ కార్యక్రమాల్లోనూ హరికథాగానం చేశారు. ప్రముఖుల ప్రశంసలనూ అందుకున్నారు. 'గానకోకిల', 'మధురగాయని' వంటి బిరుదులతో మనసు సంతృప్తి చెందినన్ని సత్కారాలు పొందినట్టు శ్రీవాణి చెప్పారు. ఇప్పటికీ కథాగానం చేస్తున్నారు. 'హరికథ కళ తనికిచ్చిన అదృష్టం ఇదంతా' అంటారు.

కౌలు రైతులు సీసీఆర్ కార్డులు పొందాలి

ఎంపీపీ పద్మావతి



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: కౌలు చేస్తున్న ప్రతి కౌలు రైతులు పంట సాగుదారు హక్కు పత్రం(సీసీఆర్‌సీ) విధిగా పొందాలని, అందుకు గ్రామంలోని వ్యవసాయాధికారులతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు రైతులకు సీసీఆర్ కార్డులపై అవగాహన కల్పించి వందకు వంద శాతం కౌలు కార్డులు అందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అడిగిన ప్రశ్నలకు అధికాలు సమాధానాలిచ్చారు. ముందుగా మండలస్థాయి అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణు ప్రసాద్, మండల ఉపాధ్యక్షులు బొల్లిముంత పోతురాజు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న చాంద్ బాషా

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ప్రభుత్వ ఉద్యోగులతోపాటు విశ్రాంత ఉద్యోగులకూ మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా కోరారు. శుక్రవారం స్థానిక ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తమపట్ల సానుకూలంగా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు శివారెడ్డి, నాగేశ్వరరావు, రహిమాన్, పోతురాజు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు అవసరం



విశాల్ నాయర్‌ను సత్కరిస్తున్న కేఎల్‌యూ ప్రొ చాన్స్‌లర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు

తాడేపల్లి రూరల్ : వైద్య, రక్షణ రంగాలకు నూతన ఆవిష్కరణలు అవసరమని కేఎల్‌యూ ప్రొ చాన్సలర్ కె.ఎస్.జగన్నాథరావు అన్నారు. శుక్రవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మల్టీ డిసిప్లినరీ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ పారిశ్రామిక వేత్త విశాల్ నాయర్ విచ్చేశారు. ఆయన ప్రసంగిస్తూ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలో ఆవిష్కరణ, వ్యవస్థాపకత తక్షణ అవసరాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐఐ డైరెక్టర్, ఎండీఐఈ విభాగాధిపతి డాక్టర్ కె. నరసింహారావు మాట్లాడుతూ ఆవిష్కరణల కోసం అందుబాటులో ఉన్న సౌకర్యాలు, వ్యవస్థలను వివరించారు. ప్రాంతీయ విద్యాభివృద్ధికి విశ్వవిద్యాలయం నిబద్ధతను వెల్లడించారు. కేఎల్‌యూ ప్రొ చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లు, అవకాశాల కోసం వైద్య, రక్షణ, వ్యవసాయం తదితర వివిధ రంగాలలో ఆవిష్కరణల పాత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కేఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్. వెంకట్రామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, రిజిస్ట్రార్ కె. సుబ్బారావు, కేఎల్ టిఫ్ సీఈవో ఎం.వి. రమణ్‌కాంత్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ–ఏపీ, సర్ సీఆర్ రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, శశి ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్, ప్రిన్‌స్టన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ–హైదరాబాద్, బాపట్ల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ తదితర విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన అవసరం

పట్నంబజారు: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌పై అవగాహన కలిగి ఉండాలని వెస్ట్ ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు చెప్పారు. శుక్రారం చంద్రమౌళి నగర్‌లోని భాష్యం కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ అంశాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు డ్రైవింగ్ చేసే క్రమంలో భాగంగా ప్రతి ఒక్క నిబంధన పాటిస్తూ, అన్ని ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. తప్పనిసరిగా హెల్మెట్ అవసరమని, ప్రమాదం జరిగిన సమయంలో ప్రాణ నష్టాన్ని నిలువరిస్తుందన్నారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ఏదైనా ప్రమాదం సంభవిస్తే తల్లిదండ్రులు కూడా నిందితులు అవుతారన్న విషయాన్ని గుర్తించాలన్నారు. బంగారు భవిష్యత్తును పాడు చేసుకోకుండా ప్రతి ఒక్క విద్యార్థి ఉన్నత చదువులు అభ్యసించాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ముఖ్యం



మేడికొండూరు మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద మిషన్ శక్తి వంద రోజుల కార్యక్రమం జరిగింది. ఇందులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీతారావమ్మ మాట్లాడుతూ.. బాలింతలు, గర్భిణులు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పౌష్టికాహా రం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవా లని సూచించారు. డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ అజీజ్, పంచాయతీ సెక్రటరీ కిషోర్‌రెడ్డి, ఏఎన్‌ఎం భారతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాజీబాబా దర్గా అటెండర్ మృతి

పెదకాకాని: అనారోగ్యంతో బాజీబాబా దర్గా అటెండర్ షేక్ అబ్దుల్ సత్తార్ (53) మృతి చెందినట్లు దర్గా ఈవో షేక్ ముక్తార్ బాషా తెలిపారు. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాలో అటెండర్‌గా అబ్దుల్ సత్తార్ దీర్ఘకాలంగా పని చేసి దర్గా అభివృద్ధిలో తనవంతు కృషి చేశాడు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. దర్గా ఈవో షేక్ ముక్తార్ బాషా, సిబ్బంది అబ్దుల్ మృతదేహానికి నివాళులర్పించి, మృతుని కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

బార్ సిబ్బందిపై దాడి ఘటనపై కేసు

తెనాలిరూరల్: మద్యం తాగి బార్‌లో పని చేస్తున్న సిబ్బందిపై దాడి చేసిన యువకుడిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పల్నాడు జిల్లా గురజాలకు చెందిన చింతా మణికుమార్ మరో ఇద్దరు స్నేహితులతో కలసి తెనాలి రైల్వే స్టేషన్ రోడ్డులోని ప్రముఖ బార్‌కు గురువారం రాత్రి వచ్చాడు. రాత్రి పొద్దుపోయాక మిగిలిన ఇద్దరు మద్యం తాగి వెళ్లిపోగా, మణికుమార్ జారుకునే ప్రయత్నం చేశాడు. పసిగట్టిన బార్ సిబ్బంది అతన్ని అటకాయించడంతో వారిపై దాడి చేసి గాయపర్చాడు. బార్ నిర్వాహకులు, సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నూతన ఆటో స్టాండ్ ప్రారంభం



లక్ష్మీపురం: ది గుంటూరు నగర ఆటో డ్రైవర్స్ – వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ఎదురుగా గాంధీ పార్క్ వద్ద నూతన ఆటో స్టాండ్‌ను యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. యూనియన్ నగర అధ్యక్షుడు, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకిటి అరుణ్ కుమార్, మేడా హనుమంతరావు, నగర అధ్యక్షుడు కూరాకుల రాంప్రసాద్ పాల్గొని, ప్రసంగించారు. నగర ప్రధాన కార్యదర్శి మంగా శ్రీనివాసరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. స్టాండ్ ఇన్‌చార్జి దామరపల్లి వెంకటరావు, అధ్యక్షుడు పసల వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ రాచకొండ బుల్లిబాబు, కార్యదర్శి అల్లూరి వెంకట కృష్ణ, సహాయ కార్యదర్శి పలకలూరి కోటేశ్వర రావు, కోశాధికారి కన్నబోయిన శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



లక్ష్మీపురం: రాష్ట్రంలో ఆస్తి పన్ను ఏటా 15 శాతం పెరుగుదలను తక్షణమే నిలిపి వేయాలని, ఆస్తి పన్ను సవరణ చట్టాన్ని రద్దు చేయాలని.. ఆస్తి పన్ను చెల్లింపు దార్ల విస్తృత సమావేశం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివ రామిరెడ్డి, సిటీ హౌస్ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి పి.ఎస్.మూర్తి పేర్కొన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అద్దె విలువ మీద ఆస్తి పన్ను లెక్కించే విధానాన్ని రద్దు చేసి, ఆస్తి విలువ మీద పన్ను లెక్కించే విధానాన్ని ప్రవేశ పెట్టిందని గుర్తుచేశారు. దీని కోసం మున్సిపల్ చట్టాలను సవరణ చేస్తూ సవరణ చట్టాన్ని తెచ్చిందని తెలిపారు.

నోటు పుస్తకాల అందజేత

ఫిరంగిపురం: పేదవారిని తమ ట్రస్ట్ ద్వారా ఆదుకుంటామని గుర్రం ఉషారాణి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సొలస బస్టాండ్ సెంటర్ షిర్డీ సాయినాథ మందిరంలో శుక్రవారం సదావర్తి అన్నదాన సత్రం (నుదురుపాడు) ఫౌండర్ ట్రస్టీ గుర్రం నాగేశ్వరరావు, ఉషారాణిలు పాఠశాల హెచ్‌ఎంలకు 6 వేల నోట్‌పుస్తకాలు, 700 పలకలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ నాదెండ్ల, మేడికొండూరు, యడ్లపాడు, ఫిరంగిపురం మండలాల్లోని 40 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందజేసేందుకు వీటిని అందజేశామన్నారు. కార్యక్రమంలో కె. కొండలరావు, సూరి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

తాడికొండ: అప్పుల బాధతో పురుగుమందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడికొండ మండలం పాములపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాములపాడు గ్రామానికి చెందిన కొల్లూరు అశోక్(48) రైతు. కొన్ని సంవత్సరాలుగా సాగులో వరుస నష్టాలు రావడంతో అప్పుల పాలయ్యారు. ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.

దుకాణం తొలగించాలంటూ స్థానికుల ఆందోళన

- కోర్టు స్టే తెచ్చుకున్న నిర్వాహకుడు
- తాళం వేసి శాంతింపజేసిన మున్సిపల్, పోలీసు అధికారులు



షాపు ముందు ఆందోళన చేస్తున్న స్థానికులు

తెనాలిఅర్బన్: మున్సిపల్ స్థలంలో ఉన్న దుకాణాన్ని తొలగించాలంటూ స్థానికులు శుక్రవారం ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న మున్సిపల్, పోలీసు అధికారులు అక్కడకు చేరుకుని షాపును తాత్కాలికంగా మూసివేయించి ఆందోళన విరమింపజేశారు. మున్సిపల్ అధికారుల కథనం ప్రకారం నందులపేట ఎన్‌టీఆర్ బొమ్మ సెంటర్‌లో అంచ నరేంద్రకుమార్ సమీపంలోని మున్సిపల్ స్థలంలో శ్రీహరి జనరల్ అండ్ ఫ్యాన్సీ స్టోర్స్ ఏర్పాటు చేసుకుని వ్యాపారం నిర్వహిస్తున్నారు. అయితే స్థానికులతో అతనికి విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్థానికులు శుక్రవారం షాపు ముందు ధర్నా చేశారు. అలాగే షాపులోని వస్తువులు కొన్నింటిని పగులకొట్టారు. వెంటనే షాపు ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌లు జడ్.సుధాకర్, సుబ్బారావు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. అలాగే వన్ టౌన్, టు టౌన్ సీఐలతో పాటు పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. షాపును తొలగించవద్దు అంటూ కోర్టునుంచి స్టే ఆర్డర్ ఉండటం వలన దానిని తొలగించలేక పోయామని మున్సిపల్ అధికారులు పోలీసులకు తెలియజేశారు. ఈ నెల 25న వాయిదా ఉందని, ఆ సమయంలో న్యాయమూర్తి ఇచ్చే తీర్పు ఆధారంగా నడుచుకుంటామని చెప్పారు. దీనికి శాంతించని ఓ మహిళ పెట్రోలు పోసుకునేందుకు ప్రయత్నించింది. దీనిని గమనించిన పోలీసులు బాటిల్‌ను లాక్కుని పారపోశారు. అనంతరం స్థానికుల కోరిక మేరకు షాపుకు తాళాలు వేశారు. తాము చెప్పే వరకు తాళాలు తీయవద్దని షాపు నిర్వాహకుడికి సూచించారు. దీంతో స్థానికులు ఆందోళన విరమించారు.

ఉదారతను చాటుకున్న బాల్య స్నేహితులు



విద్యార్థికి నగదు అందజేస్తున్న లీలా మోహన్‌రావు

భట్టిప్రోలు: బాల్య స్నేహితులు తమ ఉదారతను చాటుకున్నారు. అందరూ కలసి కట్టుగా ఉంటూ ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా నిలవాలనుకున్న నిర్ణయాన్ని ఆచరణలో పాటించారు. భట్టిప్రోలు టీఎం రావు హైస్కూల్ 1987–1988 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మైత్రి విద్యా సేవా సమితిని ఏర్పాటు చేసుకుని, తమ స్నేహితులు ఆపదలో ఉంటే ఆదుకునేందుకు కృషి చేస్తున్నారు. కష్టంలో ఉన్న తోటి స్నేహితురాలు గాలంకి విజయవర్ధిని కుమార్తె విక్టోరియా ఇంటర్మీడియట్ విద్యాభ్యాసం కోసం రూ. 36 వేలు అందించారు. ఈ చెక్కును శుక్రవారం స్థానిక బౌద్ధ స్తూపం వద్ద విశ్రాంత తెలుగు పండిట్ ముద్దా లీలామోహన్‌రావు చేతుల మీదగా పూర్వ విద్యార్థులు అందజేశారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉషారమణి, పీవీ రమణారావు, శ్రీనివాసు, దేవాజీ, రమణ, ఆంజనేయులు, విజయసారథి, సురేంద్ర, సుబ్బారావు, కరిముల్లా, సాయి, ఎ.సుబ్బారావు, షర్ఫుద్దీన్, టి.గంగాధర్, ఎం.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీమా ప్రీమియంపై జీఎస్టీ ఉపసంహరించాలి



ఎంపీ శ్రీ కృష్ణదేవరాయలుకు వినతిపత్రం అందజేస్తున్న బీమా ఉద్యోగులు

కొరిటిపాడు: బీమా ప్రీమియంపై విధిస్తున్న 18 శాతం జీఎస్టీని ఉప సంహరించి, ప్రత్యేక రాయితీలు కల్పించాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలును శుక్రవారం బీమా ఉద్యోగులు కలిసి, వినతి పత్రం అందజేశారు. సెక్షన్ 80సీ కింద ప్రత్యేక ఇన్‌కం ట్యాక్స్ రాయితీలు కల్పించాలని, ఆరోగ్య బీమాపై సెక్షన్ 80డీ కింద రద్దు చేసిన రాయితీలను నూతన ఐటీ విధానం కింద పునరుద్ధరించాలని కోరారు. కోరుతూ ప్రభుత్వ రంగంలోని నాలుగు సాధారణ బీమా సంస్థలను విలీనం చేయడం దేశ ఆర్థిక ప్రయోజనాలకు ఉపయోగకరమన్నారు. బీమా రంగానికి సంబంధించిన ముఖ్యమైన సమస్యలను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఎంపీ శ్రీ కష్ణ దేవరాయలు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఎల్ఐసీ ఉద్యోగుల యూనియన్ మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి వి.వి.కె సురేష్, కె.జి రమేష్, ఆర్.వి.ఎస్ శ్రీనివాస్, డి.సైదులు, ఐ.వెంకట్రావు, ఎస్.ప్రసాద్, పి.ఆర్ రాజశేఖర్, ఎం.రాజేశ్వరరావు తదితరులున్నారు.

మాదక ద్రవ్యాలను అరికట్టాలి

ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన



ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

లక్ష్మీపురం: యువత ప్రాణాలతో చెలగాటమాడుతున్న గంజాయి, మాదక ద్రవ్యాలను అరికట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గుంటూరు నగరంలోని కొత్తపేట భగత్ సింగ్ కూడలి వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జంగాల చైతన్య మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాలను పాడు చేసుకుంటున్నారన్నారు. ఎన్డీఏ కూటమి ఎన్నికల ప్రచారంలో మత్తు పదార్థాలను అరికడతామని ప్రజలకు హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి యువకుల ప్రాణాలను కాపాడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని విద్యార్థులు మత్తుపదార్థాల బారిన పడకుండా చర్యలు చేపట్టాలన్నారు.

లేకుంటే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన బాట పడతామని హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు అరుణ్, మట్టిపల్లి కిరణ్, నాయకులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో పార్కింగ్ కష్టాలు



పార్కింగ్ స్థలంలో మెరక కోసం పోసి ఉంచిన డస్ట్ మెటీరియల్

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థకు వివిధ పనుల నిమిత్తం రోజుకు కొన్ని వందల మంది వస్తుంటారు. అయితే కార్యాలయంలో వాహనాల పార్కింగ్ సమస్య ఏర్పడింది. గత కొద్ది రోజుల క్రితం పార్కింగ్ ప్రాంతాన్ని పూర్తిగా తవ్వేశారు. అక్కడ మెరక చేసి.. పార్కింగ్‌కు ఉపయోగపడే విధంగా సీసీ రోడ్డు వేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే సుమారు రూ.36 లక్షలతో ఖర్చు పెట్టి చేస్తున్న ఈ పనులు చూసి నగర వాసులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఒక పక్క కార్యాలయాన్ని కూల్చివేసి కొత్త భవనం కట్టించాలని ప్రతిపాదనలు ఉన్నప్పటికీ ఇప్పుడు హడావుడిగా పార్కింగ్ కోసం ఇన్ని లక్షలు ఖర్చు చేయడంపై పెదవిరిస్తున్నారు. ఈ పనులైన సకాలంలో పూర్తి చేస్తున్నారా అంటే అది లేదు... రోజుల తరబడి పనులు సాగదీయడంతో కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వాహనదారులు తమ వాహనాలను పార్కింగ్ చేయడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. నిన్న మొన్నటి దాకా వాహనాలను రోడ్డు మీదే నిలపాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన అధికారులు త్వరిత గతిన పార్కింగ్ పనులు పూర్తి చేసి, నగరవాసులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.